

కమలంలో కయ్యం

రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలోనే కీలక నేతల మధ్య బయటపడిన విభేదాలు



పాలమూరుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఇటీవల వచ్చిన సందర్భంగా ముఖ్య కార్యకర్తల సమావేశంలో తోపులాడుకుంటున్న కార్యకర్తలు

- డీకే అరుణ వర్సెస్ బండారి శాంతికుమార్ వర్గాలుగా విడిపోయిన నేతలు
- బీసీ నినాదం తెరపైకి, మున్నూరుకాపు సామాజికవర్గం కావడంతో చర్చ
- స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట కీలక నేతల కొట్లాటతో కేడర్ ఆందోళన
- తమ నేతను అవమానించారని నారాజ్‌లో ఉన్న శాంతికుమార్ వర్గం కార్యకర్తలు

క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకునే కమలం పార్టీలో విభేదాలు బహిర్గతమయ్యాయి. ఇటీవల ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వంలో చోటుచేసుకుంటున్న పరిణామాలకు తక్కువేం కాదన్నట్లుగా మహబూబ్‌నగర్ లోనూ కనిపిస్తున్నాయి. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వేళ్లూనుకున్న విభేధాలు స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం అవుతున్న వేళ వెలుగుచూశాయి. రాజకీయంగా ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక స్థానం కలిగిఉన్న డీకే అరుణ వర్గీయులు బీజేపీ సీనియర్ నాయకులు బండారు శాంతి కుమార్ పార్లమెంట్ ఎన్నికల్లో సహకరించలేదని ఆగ్రహం వ్యక్తం చేయడం నివురుగప్పిన నిప్పులా ఉన్న అసంతృప్తిని బహిర్గతం చేసింది. అందుకు అనుగుణంగానే అదే సమావేశంలో స్థానిక ఎంపీ డీకే అరుణ చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోసినట్లు అయ్యాయి. శాంతికుమార్ నుంచి పెద్దగా ప్రతిస్పందన రాకపోయినా ఆయన క్యాడర్‌ను ఈ పరిణామం మరింత నిరాశకు గురిచేసింది. ఈ అసంతృప్తుల జ్వాల ఎప్పటికి సమసిపోతుందో చూడాలి.

మహబూబ్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సాధారణంగా బీజేపీలో కుమ్ములాటలు పెద్దగా కనిపించవు. కేడర్ మొత్తం క్రమశిక్షణతో పనిచేస్తుంది. పార్టీ నుంచి వచ్చిన ఆదేశాలను తూ.చ. తప్పకుండా అమలు చేసే కేడర్ బీజేపీకి ఉంటుంది. ఒక్కసారి బీజేపీ సిద్ధాంతాలు, కట్టుబాట్లకు అలవాటైన వారు అంత తొందరగా పార్టీ మారరనే భావన ప్రజల్లో ఉంటోంది. ఒక వేళ ఏదైనా వివాదాలు, అంతర్గత సమస్యలు, టిక్కెట్ పంచాయితీలు ఉన్నా పార్టీ అంతర్గత వేదికల్లోనే పరిష్కరించుకుంటారు. బయటకు మాత్రం విభేదాలను చూపెట్టరు. అలాంటి బీజేపీ ఈసారి స్థానిక సంస్థల ఎన్నికలను సీరియస్‌గా తీసుకున్నది. స్థానికంలో ఎక్కువ స్థానాలు గెలిస్తేనే రాష్ట్రంలో అధికారం చేపట్టవచ్చనే భావనకు నాయకత్వం వచ్చింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గణనీయంగా ఎనిమిదేసి సీట్లను దక్కించుకున్నది. అయితే ఇటీవలి కాలంలో పలువురు నేతల మధ్య విభేదాలు బయటపడుతున్నాయి. రాష్ట్రస్థాయి నుంచి మొదలుకొని జిల్లాస్థాయి వరకు ఇవి బహిరంగ చర్చకు వస్తుండటంతో కేడర్‌లో నిరుత్సాహం వస్తోంది. ఏ క్రమశిక్షణతో ఉంటారనే పేరుందో అదే క్రమశిక్షణను కోల్పోతున్న పరిస్థితి ఏర్పడుతోంది. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో



డీకే అరుణ



శాంత కుమార్

(మిగతా 6లో..)

పార్లమెంట్ ఎన్నికల నుంచే...

ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీజేపీ ఇప్పటివరకు రెండుసార్లు ఎంపీ స్థానాన్ని దక్కించుకున్నది. ఒకసారి ఏపీ జితేందర్‌రెడ్డి గెలువగా, 2024లో డీకే అరుణ ఎంపీగా గెలిచారు. 2018 వరకు కాంగ్రెస్‌లో కొనసాగిన డీకే అరుణ తర్వాత పరిణామాలతో పార్టీని వీడి బీజేపీలో చేరారు. చేరిన వెంటనే మహబూబ్‌నగర్ ఎంపీ టిక్కెట్ ఇవ్వగా రెండో స్థానంలో నిలిచారు. ఆ తర్వాత పార్టీ అధిష్టానం జాతీయ ఉపాధ్యక్షురాలి పదవిని కట్టబెట్టింది. 2024 ఎన్నికల్లో మహబూబ్‌నగర్ స్థానం నుంచి ఆమె టిక్కెట్ ఆశించగా బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా ఉన్న బండారి శాంతికుమార్ కూడా టికెట్ ఆశించారు. బీసీలకు కేటాయిస్తే తనకు అవకాశం వస్తుందని ఆశించారు. ఆ మేరకు కార్యాచరణ కూడా చే సుకున్నారు. అయితే పరిస్థితులను



అంచనా వేసుకున్న అధిష్టానం టిక్కెట్‌ను డీకే అరుణకే కేటాయించింది. ఆ ఎన్నికలు మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నడూ లేనంతగా ఎత్తుకు పైఎత్తులకు దారితీశాయి. సీఎం రేవంత్ రెడ్డి సైతం పదిసార్లు పర్యటనలు చేయాల్సి వచ్చింది. హోరాహోరీగా సాగిన ఎన్నికల్లో డీకే అరుణ 4 వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధించారు. అయితే ఆ సమయంలో బండారి శాంతికుమార్, ఆయన వర్గం గెలుపునకు సహకరించలేదనే అనుమానం డీకే అరుణ, ఆమె వర్గం నేతలకు ఉన్నది. అది ఇన్నాళ్లు నివురుగప్పిన నిప్పులా అంతర్గతంగా కొనసాగుతోంది. ఎవరికి వారే కార్యాచరణ చేసుకుంటూ వస్తున్నారు. పార్టీలో శాంతికుమార్ సీనియర్ నేత కాగా ప్రభుత్వపరంగా, ప్రజాప్రతినిధిగా డీకే అరుణకు ఎక్కువ అనుభవం ఉన్నది. ఇదేక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన జరగ్గా డీకే అరుణ వర్గం నేతలు నినాదాలు చేస్తూ విభేదాలు బయటపడేలా చేశారు.

మెరుగైన సేవలే ప్రభుత్వ లక్ష్యం

'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌లో డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్



ఫోన్‌లో మాట్లాడుతున్న జయచంద్రమోహన్

నారాయణపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సిబ్బంది సమష్టిగా కృషి చేస్తుందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జయచంద్రమోహన్ అన్నారు. నారాయణపేట డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి జిల్లా ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ప్రజల ప్రశ్నలకు ఆయన సమాధాలు ఇలా ఉన్నాయి..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

ఖలీల్, నారాయణపేట: పేటలో ప్రభుత్వ వైద్యసేవలు అందడం లేదు. మొబైల్ అంబులెన్స్‌ల ద్వారా లేదంటే వార్డులలో వైద్యసేవలు అందించాలి.

జవాబు: అంబేడ్కర్ చౌరస్తాలో అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా సేవలు అందుతున్నాయి. పాత ఆస్పత్రి భవనం కూలే ప్రమాదం ఉండటంతో జిల్లా ఆస్పత్రిని అప్పక్‌పల్లికి తరలించాం. మొబైల్ అంబులెన్స్‌లపై లేఖ పంపిస్తాం.

రవికుమార్, సింగారం గ్రామం: అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. మందులు అందుబాటులో ఉంచాలి.

జ: ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉంచాం.

తిరుమలయ్య, గుండుమాల్: అన్ని రోగాలకు ఒకే రకమైన మందులు ఇస్తున్నారు.

జ: అన్ని రకాల రోగాలకు ఒకే రకమైన మందులు ఇవ్వరు.

రాజుల అశిరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు, మక్తల్ : మక్తల్ ఆస్పత్రిలో ఆరుగురికి ముగ్గురే వైద్యులు ఉన్నారు. నీటి ఎద్దడి ఉంది. చిన్న పిల్లలకు సేవలు అందడం లేదు.

జ: మక్తల్ ఆస్పత్రి వైద్యవిధాన పరిషత్ పరిధిలోకి వెళ్లింది. నీటి ఎద్దడిని పరిష్కరించి, చిన్న పిల్లలకు వైద్య సేవలు అందేలా చూస్తాం.

నారాయణ, మరికల్: మరికల్‌లో సిబ్బంది రోగులను కసురుకుంటారు. డాక్టర్ విధులకు సకాలంలో వస్తలేరు.

జ: సిబ్బంది రోగులతో మర్యాదగా వ్యవహరించేలా చూస్తాం. వైద్యులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటాం.

సాత్విక, మాగనూర్: మాగనూర్ ఆస్పత్రి సిబ్బంది వేళకు రావడం లేదు.

జ: సమయపాలన పాటించేలా చూస్తాం.

అనంత్‌రెడ్డి, బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఇమ్రాన్ పటేల్, నారాయణపేట: బీపీ చెకప్ కోసం పది కిలో మీటర్లు వెళ్లాల్సి వస్తోంది. పేట పాత బస్టాండ్ దగ్గర అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలి.

జ: అంబేడ్కర్ చౌరస్తాలో అర్బన్ హెల్త్ సెటర్ ఉంది. రెండు బస్తీ దవాఖానాల కోసం ప్రతిపాదనలు పంపాం. పల్లె ప్రాంతంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తాం.

అయ్యప్ప, న్యాయవాధి, మరికల్: ఆర్ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తున్నారు. పాముకాటు వ్యాక్సిన్ అందుబాటులో ఉందా?

జ: ఆర్ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తే చర్యలు తప్పవు. పాము కాటు వ్యాక్సిన్ ఉంది.

సూర్యకాంత్, మాజీ కౌన్సిలర్, ఊట్కూర్: ప్రైవేటు ఆస్పత్రులు అధిక ఫీజులతో దోపిడీ చేస్తున్నాయి.

జ: అధిక ఫీజులపై పర్యవేక్షిస్తాం.

అదిమోద్దీన్, ధన్వాడ: చర్మ వ్యాధులకు మందులు లేవా?

జ: అన్ని రకాల మందులు ఉన్నాయి. వారం రోజుల క్రితం ఇన్సులిన్ కొరత ఉండగా, ఇప్పుడు వచ్చింది.

రూ.వంద కోట్ల బకాయిలు చెల్లించాం..

- నాలున్నర లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నాం..
- తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య విజయ డెయిరీ చైర్మన్ అమిత్‌రెడ్డి



మాట్లాడుతున్న గుత్తా అమిత్‌రెడ్డి

మిడ్జిల్/జడ్చర్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో విజయ డెయిరీ ద్వారా నాలుగున్నర లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నామని పాడి పరిశ్రమ అభివృద్ధి, సహకార సమాఖ్య విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. 3 లక్షల లీటర్ల పాలు మాత్రమే విక్రయాలు జరుగుతున్నాయని, మిగతావి పాల పదార్థాల తయారీకి వినియోగిస్తున్నామని చెప్పారు. రూ.100 కోట్ల బకాయిలు రైతులకు చెల్లించామని అన్నారు. సోమవారం మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లి గ్రామంలో బీఎంసీయూలో విజయ డెయిరీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవిందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి అమిత్‌రెడ్డి హాజరై, మాట్లడారు. గత ప్రభుత్వ హయాంలో విజయ డెయిరీ పాడి రైతులకు దేశంలోనే అత్యధిక ధరను అందించిందన్నారు. అదే స్థాయిలో మార్కెట్‌లో పాల ఉత్పత్తులను విక్రయించ లేకుండా పోయిందన్నారు. దాంతో డెయిరీ నష్టాల బారిన పడిందన్నారు. లీటరుకు రూ.4 రూపాయల ప్రోత్సాహకం ప్రభుత్వం మాట్లడి రైతులకు వెంటనే అందేలా చర్యలు చేపడుతున్నామన్నారు. నష్టాల్లో ఉన్న డెయిరీన తాను చైర్మన్ అయ్యాక సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి, రూ.100 కోట్ల నిధులను మంజూరు చేయించానని చెప్పారు. రైతులకు బకాయిలను చెల్లించడం జరిగిందన్నారు. ప్రోత్సహంతో పాటు పశువుల బీమా గురించి త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు తీపి కబురు అందించనుందన్నారు. పాడి రైతుల ఉత్పత్తిని బట్టి సామగ్రిని వెంటనే అందించేందుకు కృషి చేస్తామని, గ్రామాలలో పాల పరిశీలన పరికరాలను అవసరం మేరకు మంజూరు చేస్తామని చెప్పారు. బీఎంసీ అదనపు సామర్థ్యాన్ని 5 వేల లీటర్లు పెంచేందుకు మంజూరు చేస్తామన్నారు. సహకార సంఘాలను పటిష్టపరిచి, రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో విజయ డెయిరీ పాల ఉత్పత్తులు అందేలా స్టాల్స్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ జీఎం మధుసూదన్‌రావు, క్వాలిటీ కంట్రోల్ అధికారి కవిత, మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి శివరాజ్, విజయ డెయిరీ జిల్లా డీడీ శ్రీనివాస్, మేనేజర్ ఎ.శ్రీనివాస్, బీఎంసీ సూపర్‌వైజర్ యాదయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జడ్చర్ల డెయిరీ సందర్శన

జడ్చర్ల హౌజింగ్ బోర్డు సమీపంలోని విజయ డెయిరీ కేంద్రాన్ని చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి సందర్శించారు. పాడి రైతులు, డెయిరీ నిర్వాహకులతో సమావేశమయ్యారు. జిల్లా అధికారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.



నేడు ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో..

మహిళా చట్టాలపై అవగాహన సదస్సు

నారాయణపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మహిళల చట్టాలపై 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో నారాయణపేట శ్రీసాయి జూనియర్ కళశాలలో మంగళవారం ఉదయం అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. 11:30 గంటలకు షీటీం బృందం అధికారులు చట్టాలపై వివరించనున్నారు. సదస్సుకు షీటీం జిల్లా ఇన్‌చార్జి ఎస్ఐ సునీత, అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు హాజరు కానున్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై, అవగాహన తెచ్చుకోవాలి.

బలవంతపు సేకరణ చేయొద్దు

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్



కలెక్టరేట్ ముట్టడికి వెళ్తున్న రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

నారాయణపేట టౌన్ జూలై 28 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా ప్రలోబాలు, మోసంతో భూసేకరణ చేయొద్దని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ అన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. భూ నిర్వాసితులు సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని మునిసిపాల్ పార్కు నుంచి ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ముట్టడికి బయల్దేరారు. శాసనపల్లి రోడ్డులో పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే బైఠాయించి, మూడు గంటల పాటు రాస్తారోకో చేశారు. ఆర్డీవో రాంచందర్ నాయక్ రైతులను బెదిరించడం సరైందని కాదన్నారు. బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా బేసిక్ ధరను నిర్ణయించి, 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అక్కడికి రాగా, ఆయనకు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో 20 గ్రామాల రైతులు, భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, మచ్చేందర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రాఘవచారి, భీంరెడ్డి, అశోక్‌జోషి, కాశప్ప, ధర్మరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాకర్లపహాడ్‌కు తరలిన యంత్రాంగం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- అంటు వ్యాధులపై కలెక్టర్ ఆరా
- పరీక్షలు చేయాలని ఆదేశం
- 8 మంది జ్వరం.. ఇద్దరికి చికున్‌గున్యా

6

ఇక్కడ నాగుల పంచమి.. అక్కడ తేళ్ల పంచమి

- కర్ణాటకలోని కందుకూరులో వింత పండుగ
- నేడు వేడుకలు

7

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

6

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి



సమస్యలు వింటున్న కలెక్టర్

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత అధికారులకు రెఫర్ చేస్తూ, వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎట్టి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టొద్దని చెప్పారు. ప్రజావాణికి 144 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, ఆర్డీవో నవీన్, జెడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, డీఆర్డీవో నర్సిములు, అధికారులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి...

దివిటిపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో కాలనీ వాసులు ప్రజావాణికి వచ్చారు. సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు, డ్రైనేజీలు నిర్మించాలని కలెక్టర్‌కు విన్నవించారు. నాయకులు రాములు, కిల్లెగోపాల్, మెహన్, నవాబ్, పద్మ పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇప్పించాలి

సీసీకుంట మండలం ఏదులాపూర్‌లో 38 మంది పేదలకు 2023లో ప్రభుత్వం ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా ఆక్రమించుకుకొని, రాళ్లను పాతారని తమకు న్యాయం చేయాలని బాధితులు విన్నవించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

అద్దె వాహనాల పెండింగ్ బిల్లులు చెల్లించాలని తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ అద్దె వహనాల అసోసియేషన్ సభ్యులు ప్రజావాణిలో విన్నవించారు. వివిధ శాఖల్లో నెలల తరబడి అద్దెలు పెండింగ్ ఉన్నాయని, బిల్లులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పాలమూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. చాలీచాలని వేతనాలు.. వేయి రూపాయలతో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు చెల్లించకపోవటం సరికాదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పది నెలల నుంచి వేతనాలు ఇవ్వటం లేదన్నారు. గుడ్లు, నూనె, కూరగాయలు తదితర వాటిని పది నెలల నుంచి బిల్లులు రాలేదన్నారు. రూ.లక్షల్లో అప్పుచేసి మహిళా కార్మికులు ఏజెన్సీల ద్వారా ప్రభుత్వ స్కూళ్లలో వంటలు చేస్తున్నట్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటోందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య అన్నారు. రాగిగంజి, స్నాక్స్, గుడ్లు, కూరగాయలతో వండిన నాణ్యమైన భోజనం అందిస్తున్నా జీతాలు అందడం లేదన్నారు. తక్షణమే మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించటం, వేతనాలు పెంచటం, సమస్యలను పరిష్కరించాలన్నారు. అరుణ, అంజమ్మ, నరసమ్మ, కవిత, పద్మ, కౌసల్య, యాదమ్మ, పద్మావతి, రాజేలు పాల్గొన్నారు.

ప్రారంభించేరా?

- నిర్మాణం పూర్తయినా పంపిణీకి నోచుకోని పరిస్థితి
- ఎనిమిదేళ్లుగా ఎస్సీ నిరుద్యోగుల ఎదురు చూపులు
- పంపిణీకి సిద్ధంగా ఉన్న 32షాపులు

● నిరుపయోగంగా ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్

కల్వకుర్తి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధిలో ఎస్సీ నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతగా నిలుస్తుంటాయి. కొన్ని చోట్ల పట్టణ, మండల కేంద్రాల్లో ఎస్సీలకు కాంప్లెక్స్‌లు నిర్మించి షాపులు ఇస్తూ ఉపాధి కల్పిస్తుంటారు. దీంతో ఆ కుటుంబాలు స్వయం ఉపాధి పొంది కుటుంబాలను పోషించుకుంటాయి. ఆ కోవలోనే నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో బస్టాండ్ ఎదురుగా నిర్మించిన ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ ఎందుకు పనికిరాకుండా మారింది. అందులోని షాపులు పంపిణీకి ముందే నిరుపయోగంగా మారాయి. 32షాపుల నిర్మాణాలు పూర్తై 8సంవత్సరాలు గడుస్తున్నా పంపిణీకి నోచుకోకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతున్నది. ఎస్సీ నిరుద్యోగులు మాత్రం వాటి ప్రారంభానికి ఎదురుచూస్తూనే ఉన్నారు.

● ఎస్సీ హాస్టల్ స్థలంలో..

కల్వకుర్తి పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా శిథిలావస్థలో ఉన్న ఎస్సీ హాస్టల్‌ను గత 18 సంవత్సరాల క్రితం 99 సర్వే నెంబరులో ఒక ఎకరా స్థలంలో ఎస్సీ వసతి గృహాలను నిర్మించారు. ఆ తర్వాత అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా వసతి గృహాలను ప్రారంభించారు. వృథాగా ఉన్న ఎస్సీ హాస్టల్ స్థలాన్ని ఎస్సీ నిరుద్యోగుల ఉపాధి కల్పన కోసం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆ స్థలాన్ని ఉపయోగించడానికి అప్పటి కలెక్టర్, ఎమ్మెల్యే నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఎస్సీ నిరుద్యోగులు తమకు ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టాలని షాపులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ వచ్చారు.

● ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో....

కల్వకుర్తి పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎస్సీ కార్పొరేషన్ నుంచి నిధులు మంజూరయ్యాయి. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. దాదాపు కోటీ 50లక్షలతో 32షాపుల నిర్మాణాలు పూర్తయ్యాయి.

● పంపిణీ చేస్తేనే ఉపయోగం...

కల్వకుర్తి బస్టాండ్ సమీపంలో నిర్మించిన 32షాపులను ఎస్సీ నిరుద్యోగులకు కేటాయిస్తేనే ఆ కుటుంబాలకు జీవనోపాధి దక్కుతుంది. గత 18సంవత్సరాలు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం ఎస్సీ నిరుద్యోగులు పోరాటాలు చేశారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో 32షాపులు నిర్మించి దాదాపు 8 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా నేటికీ పంపిణీ చేయకపోవడంతో వయస్సు కూడా పెరిగిపోతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నిర్మాణాలు పూర్తై పంపిణీకి నోచుకోని కాంప్లెక్స్‌లోని షాపులను వెంటనే ఎస్సీ నిరుద్యోగులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

● కేటాయింపులు లేక..

ఎస్సీ నిరుద్యోగులకు ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలను కేటాయించకపోవడంతో వాటికి వేసిన షట్టర్లు జంకు పట్టగా, కలర్ తేలిపోతున్నది. ఎంతో సదుద్దేశంతో నిర్మించిన ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలను ఎస్సీ నిరుద్యోగులకు కేటాయించకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారుతున్నది. విలువైన స్థలంలో కోటీ 50లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన షాపులను పంపిణీ చేయకపోవడంతో పలువురు ఎస్సీ నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ ముందు అడ్డంగా ఉన్న రేకుల షాపులు

డబ్బాలు, కవర్ల షెడ్లతో అడ్డంకులు

ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ ముందు కొందరు డబ్బాలు, కవర్లతో దుకాణాలను ఇతరులు వేసుకుని నిర్వహించుకుంటున్నారు. దీంతో ప్రధాన రహదారిపై రాకపోకలకు సైతం వాహనాలకు, ప్రజలకు తీవ్ర ఆటంకంగా మారింది. షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తేస్తే రోడ్డుపై ట్రాఫిక్ అంతరాయానికి పరిష్కారం దక్కనుంది.

● వెంటనే షాపులను కేటాయించాలి



ఎన్నో పోరాటాల ఫలితంగా ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు పూర్తయ్యాయి. షాపులను నిరుద్యోగులకు కేటాయించడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు ముందుకొచ్చి పంపిణీ చేపట్టాలి. ఇప్పటికే వయస్సు పెరిగిపోతున్నది. ఎస్సీ నిరుద్యోగులకు షాపులను పంపిణీ చేసి ఉపాధికి చేయూతంగా నిలవాలి.
- మబ్బు సాయన్న మాదిగ, కల్వకుర్తి

● షాపింగ్ కాంప్లెక్స్‌పై ఫస్ట్‌ఫ్లోర్ నిర్మిస్తే..

ప్రస్తుతం ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ భవనంపై ఫస్ట్ ఫ్లోర్ నిర్మిస్తే మరో 32షాపులు అందుబాటులోకి రానున్నాయి. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని నిర్మాణాలు జరిగేలా చూస్తే మరింత మంది ఎస్సీ నిరుద్యోగులకు ఉపాధి దక్కనుంది. వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతున్న కల్వకుర్తిలో షాపింగ్ కాంప్లెక్స్ ఎస్సీ నిరుద్యోగులకు వరంగా మారనుంది.

ప్రయాస్‌తో ప్రోత్సాహం

● పథకాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం

- తొమ్మిది నుంచి పదకొండవ తరగతి చదివే విద్యార్థులు అర్హులు
- ఒకరు లేక ఇద్దరు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు..
- ఉన్నత విద్యాసంస్థ నిపుణుడితో ప్రాజెక్టు సమర్పించవచ్చు
- ప్రాజెక్టు ప్రతిపాదనలకు రూ.50వేల గ్రాంట్ ఇస్తోంది



నారాయణపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులను శాస్త్రీయ పరిశోధన ఆవిష్కరణలలో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రయాస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రయాస్ అనేది ప్రమోషన్ ఆఫ్ రిసోర్స్ అటిట్యూడ్ ఇన్ యంగ్ అండ్ యాస్పరింగ్ స్టూడెంట్స్‌కు సంక్షిప్త రూపం. ఎన్‌సీఈఆర్‌టీ ఢిల్లీలోని సైన్స్ మ్యాథమెటిక్స్ ఎడ్యుకేషన్ విభాగం (డీఈఎస్ఎం) ద్వారా పాఠశాల విద్యార్థుల కోసం 2025-26 ఏడాదికి ఈ పథకం ప్రవేశపెట్టారు.

ఈ ప్రయాస్ పథకానికి సంబంధించి డైరెక్టర్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసర్చ్ అండ్ ట్రైనింగ్ తెలంగాణ నుంచి ఆర్‌సీ నెంబరు 677/ఎస్‌సిఐ/ఎస్‌సిఇఆర్‌టి-టిఎస్/2023, జూలై26, 2025న జారీ చేసిన ఉత్తర్వులు జిల్లా విద్యా శాఖాధికారికి అందాయి.

పథకం ప్రధాన లక్ష్యాలు...

పాఠశాల విద్యార్థులను శాస్త్రీయ పరిశోధన ఆవిష్కరణలో పాల్గొనేందుకు ప్రోత్సహిస్తోంది. నిజజీవిత సమస్యలను పరిష్కరించడానికి ప్రాజెక్టు అభివృద్ధిలో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఆర్ట్స్, మాథ్యమెటిక్స్ (స్టీమ్)ను ఏకీకృతం చేస్తున్నది. విద్యార్థులలో సామాజిక పర్యావరణ సవాళ్లకు వినూత్న పరిష్కారాలను కనుగొనేందుకు సాధికారత కల్పిస్తారు. విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయుడు, ఉన్నత విద్యాసంస్థల నిపుణుల మధ్య సహకారాన్ని పెంపొందిస్తుంది.

స్థానిక సమస్యలు గుర్తించడం..

ప్రయాస్ 2025-26 పథకం కింద విద్యార్థులు స్థానిక సమస్యలను గుర్తించడం.. వాటి వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలు పరిశోధించి ఏదైనా సమస్యకు శాస్త్రీయ పరిష్కారాన్ని కనుగొని వాటిపై పరిశోధన అన్వేషణ కోసం ప్రాజెక్టు ప్రతిపాదనలకు రూ.50వేల గ్రాంట్ ఇస్తుంది. తొమ్మిదవ తరగతి నుంచి పదకొండవ తరగతి చదివే విద్యార్థులు అర్హులు. ఒక విద్యార్థి గరిష్ఠం గా ఇద్దరు విద్యార్థుల బృందంతో వారి పాఠశాలలోని ఒక ఉపాధ్యాయుడు, ఏదైనా ఉన్నత విద్యాసంస్థ (హెచ్ఈఎల్)నుంచి ఒక నిపుణుడితో కలిసి ప్రాజెక్టును సమర్పించే వెసులుబాటు కల్పిం చారు. అయితే ఒక పాఠశాల నుంచి ఒక ఎంట్రీ మాత్రమే పరిగణించబడుతుంది.

ఈ ప్రాజెక్టు వ్యవధి పాఠశాలలో ప్రారంభమైన తేదీ నుంచి పూర్తయ్యేవరకు ఒక సంవత్సరం ఉంటుంది. దీని తాత్కాలిక వ్యవధి అక్టోబర్ 16, 2025 నుంచి అక్టోబర్ 16, 2026 వరకు ఉంటుంది. దరఖాస్తులు సమర్పించేందుకు ఆగస్టు 17, 2025 వరకు అవకాశం కల్పించారు. మరింత సమాచారం కోసం ఎన్‌సీఈఆర్‌టీ వైబ్‌సైట్‌ను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎన్‌సిఈఆర్‌టి.ఎన్ఐసి.ఇన్‌ని సంప్రదించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు 533 ఉండగా, విద్యార్థులు 66,387 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. 142 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, విద్యార్థులు 37, 968 మంది చదువుతున్నారు.

బాస్కెట్‌బాల్ విజేతలు వీరే..

- బాలికల విభాగంలో రంగారెడ్డి, బాలుర విభాగంలో హైదరాబాద్

అయిజ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): హోరాహోరీగా జరిగిన రాష్ట్ర బాస్కెట్‌బాల్ పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. ఈ నెల 25న అంతర్‌రాష్ట్ర జూనియర్ విభాగంలో బాలికలు, బాలురకు బాస్కెట్‌బాల్ పోటీలు జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని ఉత్తనూర్ గ్రామంలో ప్రారంభమయ్యాయి. ఇందులో బాలికల విభాగంలో 14 టీంలు, బాలుర విభాగంలో 18 టీంలు ఈ పోటీలలో తలపడ్డారు. 4వ రోజు అయిన సోమవారం బాలికల విభాగంలో ఫైనల్ మ్యాచ్‌లో రంగారెడ్డి, మేడ్చల్ జట్లు తలపడ్డాయి. ఇందులో రంగారెడ్డి జట్టుకు 64 పాయింట్లు, మేడ్చల్ 23 పాయింట్లు వచ్చాయి. దీనితో రంగారెడ్డి జట్టు మేడ్చల్‌పై 41 పాయింట్ల ఆధిక్యంతో గెలుపొందింది. బాలుర విభాగంలో ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్‌కు 63, మేడ్చల్‌కు 21 పాయింట్లు వచ్చాయి. మేడ్చల్ జట్టుపై 42 పాయింట్ల ఆధిక్యంతో హైదరాబాద్ జట్టు విజయం సాధించింది. గెలుపొందిన విజేతలకు కర్నూల్ మాజీ ఎంఎల్ఏ ఎస్వీ మోహన్‌రెడ్డి, జోగుళాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, అయిజ తహసీల్దార్ జ్యోతి మెమొంటోలను అందజేశారు.


విజేతగా నిలిచిన హైదరాబాద్ బాలుర జట్టుకు మెమొంటోను అందచేస్తున్న ఎస్వీ మోహన్ రెడ్డి, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

ప్రాంతాలు వేరైనా తెలుగు వారం

ప్రాంతాలు వేరైన మనమంతా తెలుగువారమని ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. అయిజ మండల పరిధిలోని ఉత్తనూర్ గ్రామంలో మాజీ ఎంపీపీ తిర్మల్‌రెడ్డి జ్ఞాపకార్థం గౌతమ్‌రెడ్డి, రామచంద్రారెడ్డిలు అంతర్‌రాష్ట్ర బాలిక, బాలుర జూనియర్ బాస్కెట్ బాల్ పోటీలు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడలను ప్రారంభించారు. సోమవారం ఫైనల్ మ్యాచ్‌లు కొనసాగుతుండటంతో మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన క్రీడాకారుల మధ్యన పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు.

క్రీడలు ప్రశాంత వాతావరణంలో సాగాలి

క్రీడలు ప్రశాంత వాతావరణంలో సాగాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం అయిజ మండల పరిధిలోని ఉత్తనూర్ గ్రామములో జరుగుతున్న బాస్కెట్ బాల్ బాలుర విభాగపు క్రీడలను ప్రారంభించారు. గౌతమ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి,శ్రీను, సోమశేఖర్ రెడ్డి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

ఖేలో ఇండియా సిటీ లీగ్ కిక్ బాక్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ


కిక్‌బాక్సింగ్‌లో పతకాలు సాధించిన జిల్లా విద్యార్థులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఖేలో ఇండియా సిటీలీగ్ కిక్‌బాక్సింగ్ పోటీల్లో జిల్లా విద్యార్థులు పతకాలు సాధించినట్లు జిల్లా కిక్‌బాక్సింగ్ అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. 8 బంగారు, 6 వెండి, 6 కాంస్య మొత్తం 20 పతకాలు సాధించారు. శ్రియ, వినూత్న, సాయిసుజన, దివిజ, లక్ష్మీప్రియా (బంగారు), అక్షర, దివిజా, వివేక, ఆరాధ్య లక్ష్మీ, త్రిలోక్య (వెండి), ఝాన్సీరెడ్డి, రితిక, అన్విత, లాస్య (కాంస్య) పతకాలు సాధించి సత్తా చాటారు. పతకాలు సాధించడం పట్ల జి ల్లా అధ్యక్షుడు రవికుమార్‌ను అభినందించారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

- నేటి నుంచి ఉపాధి హామీ సిబ్బంది పెన్‌డౌన్


డీఆర్‌డీవోకు వినతి పత్రం ఇస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

నారాయణపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ సిబ్బంది మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ నిరసన కార్యక్రమానికి సంబంధించి డీఆర్‌డీవో మొగులప్పకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్‌లకు మూడున్నర నెలల వేతనాలు, ఏపీవోలు, ఈసీలు, సీవోలు, డీఆర్డీఏ సిబ్బందికి రెండున్నర నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో దినసరి ఖర్చులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాసంస్థల్లో పిల్లలను చేర్పించినా నోట్‌బుక్స్, సామగ్రి ఇప్పించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పెన్‌డౌన్‌తో నిరసన వ్యక్తం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం జేఏసీ కార్యదర్శి శంకర్, సాంకేతిక సహాయకుల జిల్లా అధ్యక్షుడు రవికుమార్, సర్ఫరాజ్, హర్షవర్ధన్, వినయ్, లక్ష్మీనారాయణ, భాస్కర్ తదితరులు ఉన్నారు.

కమలంలో కయ్యం..

(5వ పేజీ తరువాయి)

2018తో పోల్చితే కొంతమేర ఓటుబ్యాంకు పెంచుకున్న బీజేపీ పార్లమెంట్‌కు వచ్చే సరికి ఒక పార్లమెంట్ సీటు దక్కించుకోవడంతో పాటు ఓటు బ్యాంకులో బీఆర్ఎస్‌ను దాటేసింది. అయితే దాన్ని స్థానిక ఎన్నికల్లోనూ కాపాడుకుంటే ప్రత్యామ్నాయం అయ్యే అవకాశమూ ఉంటుంది. శనివారం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు స్థానిక ఎన్నికల ముంగిట సమాయత్తం చేయడానికి కార్యకర్తల సమావేశాలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పర్యటించారు. అయితే మహబూబ్‌నగర్ సభలో విభేదాలు బయటపడ్డాయి. శాంతికుమార్ గో బ్యాక్ అంటూ నినాదాలను ఎంపీ డీకే అరుణ వర్గం చేయడంతో గందరగోళం నెలకొన్నది.

బీసీ నినాదం తెరపైకి...

బీజేపీ కార్యకర్తల సమావేశంలో డీకే అరుణ వర్గం నేతలు శాంతికుమార్‌ను ఘెరావ్ చేయడం, ఎంపీ కూడా పరోక్షంగా తన గెలుపునకు సహకరించలేదని, మాటల్లో జై శ్రీరాం అనేవారు.. అదే రాముడిపై ఒట్టు వేసి తన గెలుపునకు సహకరించారా? లేదా అనేది చెప్పాలని శాంతికుమార్‌ను ఉద్దేశించి అనడం, పార్లమెంట్ ఎన్నికల్లో పనిచేయని వారు ఈ మీటింగ్ కు ఎందుకు వచ్చారని అనడం తమ నాయకుడిని అవమానించడంగా భావిస్తున్నామని బీఎస్‌కే వర్గం నేతలు నారాజ్‌లో ఉన్నారు. ఇది బీసీల్లోని అతి పెద్ద సామాజికవర్గమైన మున్నూరు కాపులను అవమానించడమేనని అంటున్నారు. ఒకవేళ ఎన్నికల విభేదాలు ఉంటే పార్టీ అంతర్గత వేదికల్లో పరిష్కరించుకోకుండా కావాలనే బహిరంగ వేదికల్లో అవమానించే ప్రయత్నం చేస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోనెల శ్రీనివాస్ ఆదివారం ఆరోపించారు. అయితే డీకే అరుణ వర్గం నేతలు పార్లమెంట్ ఎన్నికల్లో పని చేయని నేతలు కొందరు మీటింగ్‌కు ఆయన తీసుకువచ్చారని, అందుకే ప్రశ్నించామని చెబుతున్నారు. అయితే రాష్ట్ర అధ్యక్షుడు కూడా ఈ గొడవను ఖండించకపోగా పార్టీనే సుప్రీం అని చెప్పడంతో పాటు గీత దాటితే చర్యలు తప్పవని, పరోక్షంగా డీకే అరుణ ఆరోపణలను సమర్థించారని, తన ప్రసంగంలో శాంతికుమార్ పేరును కూడా ప్రస్తావించలేదని ఆయన వర్గం నేతలు అభిప్రాయపడుతున్నారు. నిజంగా ఏదైనా సమస్య ఉంటే అంతర్గత వేదికలపై పంచుకోకుండా బహిరంగ వేదికలపై ఘెరావ్ చేయడం, దాన్ని ఖండించకుండా సమర్థించడం తమ నేతతో పాటు బీసీలను అవమానించినట్లవుతుందని చెబుతున్నారు. ఈ పరిణామాలు ఎక్కడికి దారి తీస్తాయో చూడాలి.

నవోదయ 9,11వ తరగతుల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

బిజినేపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : బిజినేపల్లి మండలంలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యాసంవత్సరం 9వ, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించను న్నట్లు సోమవారం ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్ తెలిపారు. మం గళవారం నుంచి సెప్టెంబర్ 23 వరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ కు చెందిన అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచిం చారు. ప్రవేశ పరీక్ష 2026, ఫిబ్రవరి 7న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కాకర్లపహాడ్‌కు తరలిన యంత్రాంగం

- అంటువ్యాధులపై ఆరా తీసిన కలెక్టర్
- వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశం


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కాకర్ల పహాడ్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ విజయేందిరబోయి

నవాబ్‌పేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని కాకర్లపహాడ్‌లో ప్రబలిన అంటు వ్యాధులపై 'ఆంధ్రజ్యోతి' ఈ నెల 26న ప్రచురించిన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. కలెక్టర్ విజయేందిరబోయి సోమవారం సాయంత్రం గ్రామంలో పర్యటించారు. ప్రజలు, బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో ఇంటింటి సర్వే చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. గ్రామంలో 8 మంది జ్వరంతో బాధపడుతున్నారని, మరో ఇద్దరికి చికున్ గున్యా వచ్చిందని తెలిపారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని, మురుగుకాలువలను శుభ్రం చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అడి గి తెలుసుకున్నారు. ఆ తర్వాత మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘాన్ని పరిశీలించారు. యూరియా ఎంత నిల్వ ఉందని సిబ్బందిని ప్రశ్నించగా, 900 బస్తాలున్నాయని వారు తెలిపారు. రైతులకు ఇబ్బందులు తలెత్త కుండా చూసుకోవాలన్నారు. అలాగే కేజీబీవీని పరిశీలించి, సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆ తర్వాత ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మొక్క నాటారు. భూభారతి ఫిర్యాదులను వచ్చేనెల 15 లోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్, ఎంపీడీవో జయరాములు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈవో నాగ్యానాయక్, ఏపీవో జ్యోతి ఉన్నారు.

ఫుడ్ పాయిజన్‌కు సీఎం బాధ్యత వహించాలి

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్


బీసీ గురుకుల పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమ గురుకుల పాఠశాలల్లో వరుసగా జరుగుతున్న విద్యార్థినులకు ఫుడ్ పాయిజనింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ డిమాండ్ చేశారు. సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడ బీసీ బాలికల గురుకుల పాఠశాల వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జి కొత్తపల్లి కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్లే ఉయ్యాలవాడ బాలికల బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయ్యిందన్నారు. కలెక్టర్, జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు కలిసి అధికారులతో సమావేశమై జిల్లాలో మరోమారు ఇలాంటి సంఘటనుల జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. బీఎస్పీ రాష్ట్ర ఈసీ సభ్యుడు పృథ్వీ రాజ్, జిల్లా ఇన్‌చార్జి బీసమొల్ల యోసేఫ్, నాయకులు వెంకటేష్, శంకర్, శివ కృష్ణ, శ్రీను, వెంకటేష్, రామకృష్ణ, సాయిబాబు పాల్గొన్నారు.

భర్తతో గొడవ పడి వివాహిత అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి చెందిన ఓ వివాహిత అదృశ్యం అయ్యింది. నాగర్‌కర్నూల్ ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న షేక్ తసీమాబేగం (26) ఈ నెల 24న భర్త షేక్ సిరాజ్‌తో గొడవ పడింది. ఆ తర్వాత తన పెద్దమ్మ ఇంటికి వెళ్తున్నానని చెప్పి చిన్న కుమారుడిని తీసుకుని వెళ్లిపోయింది. కానీ తిరిగి రాకపోవడంతో భర్త ఆమె స్నేహితులు, కుటుంబ సభ్యుల ఇళ్లల్లో వెతికాడు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ సమస్యలు తీర్చండి

రేవల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): చెన్నారం గ్రామంలో విద్యుత్ సమస్య తీర్చాలని కోరుతూ గ్రామస్థులు సోమవారం డీఈ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ చినుకు పడితే గ్రామంలో చీకటి ఏర్పడుతుందని, గ్రామానికి ప్రత్యేక ఏబీ స్విచ్ ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా అశోక్ అనే విద్యుత్ శాఖ సిబ్బంది గ్రామంలో ప్రజల దగ్గర కరెంటు బిల్లు ఎక్కువ వస్తుందని మీ కరెంటు మీటర్ మార్చాలని వారిని బెదిరించి అక్రమంగా రూ. 60వేలు వసూలు చేశారన్నారు. ఈ విషయాన్ని పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని డీఈకి తెలిపారు. కరెంటు సమస్యపై రెండు గంటల సేపు బీఆర్ఎస్ నాయకులు గ్రామస్థులతో కలిసి ధర్నా చేశారు. ఈ విషయం తెలుసుకున్న డీఈ శ్రీనివాసులు అక్కడికి చేరుకొని వారి సమస్యను మూడు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అక్రమ వసూలు చేసిన అశోక్‌పై చర్యలు తీసుకుంటామని, ప్రజల డబ్బును తిరిగి ఇప్పిస్తామని తెలిపారు. అనంతరం గ్రామస్థులు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. చెన్నారం మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాజిరెడ్డి, మాజీ సర్పంచు రమేష్‌యాదవ్, గ్రామస్థులు మహమ్మద్‌సత్తార్, వినోద్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

» నారాయణపేట, వనపర్తి, గద్వాల జిల్లాల్లో ఘటనలు


కావలి బాస్కర్ (ఫైల్)

మరికల్/ వనపర్తి రూరల్/ గట్టు/ జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మరణించారు. నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో సోమవారం ఈ సంఘటనలు జరిగాయి. నారాయణపేట జిల్లా, మరికల్ మండల పరిధిలో పెద్దచింత కుంట స్టేజీ సమీపంలో సోమవారం ఉదయం కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ రాములు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధన్వాడ మండల కేంద్రానికి చెందిన కావలి భాస్కర్ (36) సోమవారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై మహబూబ్‌నగర్‌కు బయలుదేరాడు. అదే సమయంలో శ్రీనాథ్‌రెడ్డి అనే వ్యక్తి కారులో హైదరాబాద్ నుంచి రాయిచూర్‌కు వెళ్తున్నారు. పెద్దచింత కుంట స్టేజీ సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొని పక్కనే ఉన్న చెట్లపొదల్లోకి దూసుకెళ్లాయి. దీంతో భాస్కర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. భాస్కర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిట్యాల గ్రామ శివారులో మరొకరు..


శివకుమార్ (ఫైల్)

వనపర్తి జిల్లా, మండల పరిధిలోని చిట్యాల గ్రామ శివారులో కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. వనపర్తి పట్టణంలోని పాత బజార్‌కు చెందిన పోతులపల్లి శివకుమార్ (32) చిట్యాల శివారులోని డబుల్ బెడ్ రూమ్ ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. ఆదివారం రాత్రి అతడు స్నేహితుడు కురుమయ్యతో కలిసి ద్విచక్రవాహనంపై అతడి అత్తగారి ఊరైన పెద్దమందడి మండలం బలిజపల్లికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా చిట్యాల శివారు మార్కెట్ యార్డు గేటు దగ్గర ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొన్నది. ప్రమాదంలో శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్నేహితుడు స్వల్పంగా గాయపడ్డాడు. శివకుమార్‌కు భార్య శారద, ముగ్గురు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు.

స్కూల్ బస్సు ఢీకొని వృద్ధుడు..

జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండల పరిధిలోని బల్గెర గ్రామంలో స్కూల్ బస్సు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. గట్టు ఎస్‌ఐ కేటీ మల్లేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బలిగెర గ్రామానికి చెందిన బజారన్న (60) సోమవారం ఉదయం బత్తలయ్య గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా బల్గెర సర్కిల్‌లో అయిజ పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొన్నది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు అయిజ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. సంఘటనకు కారణమైన స్కూల్ బస్సు డ్రైవర్ నరసింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సరిత, నాయకులు గట్టు తిమ్మప్ప, బలిగెర నారాయణ రెడ్డి, బాసు శ్యామల తదితరులు పరామర్శించారు.

కుక్కల దాడిలో 10 మేక పిల్లల మృతి

నారాయణపేట రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మండలంలోని బొమ్మన్‌పాడ్ గ్రామంలో కుక్కల దాడిలో పది మేకలు చని పోయాయి. గ్రామానికి చెందిన రైతు బాలకిష్టప్ప సోమవారం ఉదయం 30 మేక పిల్లలను ఇంటి దగ్గర వలలో ఉంచి, తల్లి మేకలను మేపేందుకు పొలానికి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం ఊర కుక్కలు వలలోకి దూరి మేకలపై దాడి చేశాయి. పక్కింట్లో నివసించే బంధువులు అలికిడి విని అక్కడికి చేరు కొనేసరికే 10 మేకలు చనిపోయాయి.

20 మేకల చోరీ

ఊర్కొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలంలోని మాదారం గ్రామంలో ఆదివారం రాత్రి 20 మేకలు చోరీ అయ్యాయి. బాధితుడు ఎల్లయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి ఆయన తన మేకలను సమీపంలోని షెడ్‌లో ఉంచి కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రపోయారు. సోమవారం తెల్లవారుజామున షెడ్డు వద్దకు వెళ్లి చూడగా దాదాపు 20 మేకలు చోరీ అయినట్లు గుర్తించారు. సంఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురికి న్యాయాధికారి జైలు శిక్ష విధించినట్లు నాగర్‌కర్నూల్ ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా తెలకపల్లి మండలం పెద్దకార్పాములకు చెందిన కోమటి ఎల్లయ్య, నాగర్‌కర్నూల్ మండలంలోని గగ్గలపల్లికి చెందిన సింగరాజు నాగరాజు, బిజినేపల్లికి చెందిన కటిక రాజేశ్ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. పోలీసులు వారిని సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టులో హాజరు పరిచారు. కోమటి ఎల్లయ్యకు ఒక రోజు, సింగరాజు నాగరాజుకు రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 జరిమానా, కటిక రాజేశ్‌కు ఒకరోజు జైలు శిక్ష విధిస్తూ జిల్లా ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి శ్రుతి దూత తీర్పు వెల్లడించారు.

విద్యార్థిని చితకబాదిన హాస్టల్ వార్డెన్

జడ్చర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి అశోక్‌నాయక్‌ను వార్డెన్ చితకబాదిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని ఎస్టీ హాస్టల్‌లో సోమవారం చోటుచేసుకుంది. జడ్చర్ల మండలం వల్లూరు గ్రామానికి చెందిన విద్యార్థి అశోక్‌నాయక్ తండ్రి దశరథం తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని ఎస్టీ హాస్టల్‌లో ఉంటూ ఓ ప్రైవేట్ స్కూల్‌లో 10వ తరగతి చదువుకుంటున్నాడు. తన కుమారుడి వద్ద సెల్‌ఫోన్ లేకున్నా-ఉందన్న అనుమానంతో స్కూల్ నుంచి హాస్టల్‌కు వచ్చిన తన కుమారుడిపై పైపుతో ఇష్టానుసారంగా చితకబాదాడని ఆరోపించాడు. దీంతో వాతలు పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశాడు. తన కుమారుడిని చితకబాదిన హాస్టల్ వార్డెన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరాడు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ ఎస్‌ఐ గోవర్ధన్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని తూడుకుర్తి శివారులోని భాగ్యనగర్ కాలనీకి చెందిన గుంటి శేఖర్ (44) వరి పైరుకు నీరు పెట్టేందుకు సోమవారం మధ్యాహ్నం పొలానికి వెళ్లాడు. బోరు మోటర్‌ను ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనపై మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శేఖర్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

'సుంకేసుల'కు పెరిగిన వరద

రాజోలి, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండల కేంద్రం శివారులోని సుంకేసుల జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. జేఈ మద్దిలేటి స్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం సుంకేసుల జలాశయానికి 97,000 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతోంది. దీంతో డ్యామ్ 17 గేట్లు ఒక మీటరు, 4 గేట్లు 2 మీటర్ల మేర తెరిచి 96,200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సుంకేసుల డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 292.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 290.20 మీటర్లకు చేరింది.

గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 1.20 టీఎంసీలకు ప్రస్తుతం 0.608 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అందులో నుంచి కర్నూలు కేసీ కెనాల్‌కు 1,800 క్యూసెక్కుల విడుదల చేస్తున్నట్లు జేఈ తెలిపారు.

టైగర్‌కు టైమొచ్చింది



రాజసానికి, దర్పానికి నిలువెత్తు రూపం పెద్దపులి. జీవవైవిధ్యాన్ని కాపాడటంలో అవి కీలక పాత్ర పోషిస్తాయి. వాటి సంరక్షణకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని అభయారణ్యం (అమ్రాబాద్ టైగర్ రిజర్వ్) పెద్ద పులుల అవాసానికి అనుకూలమైన వాతావరణం కలిగి ఉంది. ఎటు చూసినా కొండలు, కోనలు, మధ్యలో పారుతున్న కృష్ణానది వాటి సంఖ్య పెరుగుదలకు దోహద పడుతోంది. దీంతో ప్రతీ సంవత్సరం వీటి సంఖ్య పెరుగుతోంది. నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం....

» అమ్రాబాద్ అభయారణ్యంలో అనువైన వాతావరణం

» పెద్ద పులుల సంరక్షణకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు

» ఏటా 'మాన్‌సూన్ బ్రేక్'తో సత్ఫలితాలు

» నల్లమలలో 36 కు చేరిన పెద్ద పులుల సంఖ్య

» నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం


నల్లమల అభయారణ్యంలో కనిపించిన పెద్దపులి

నల్లమల అభ్యయారణ్యం

అచ్చంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : దేశంలో రెండవ అతిపెద్దదైన అమ్రాబాద్ పెద్ద పులుల అభయారణ్యం నాగర్‌కర్నూల్ జిల్లాలో 2,166.37 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. అనువైన వాతావరణం, అటవీ సంరక్షణకు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పెద్ద పులుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ప్రతీ సంవత్సరం 90 రోజుల పాటు మాన్‌సూన్ బ్రేక్ ఇవ్వడం అందుకు దోహద పడుతోంది. గత ఏడాది నవంబర్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు 214 బీట్లలో 700 మంది సిబ్బంది 3 నెలల పాటు శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించిన సర్వే (ఫేజ్-4 మానిటరింగ్) నిర్వహించారు. ఆ మేరకు నల్లమల అడవిలో 36 పెద్ద పులులు ఉన్నట్లు తేలింది. వాటిలో 13 మొగవి 20 ఆడ పులులున్నాయి. లింగనిర్ధారణ కానిది మరొకటితో పాటు రెండు పులి కూనలున్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది.

పులుల గణన సాగిందిలా..

అమ్రాబాద్ అభయారణ్యంలోని 10 రేంజ్‌లను 4 బ్లాకులుగా విభజించారు. వాటి పరిధిలో 1,594 సీసీ ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. 2 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 797 గ్రిడ్‌లుగా నిర్ధారించారు. వాటిలో పరిధిలో సీసీ కెమెరా పుటేజీలు, పులుల పాద ముద్రలు, విసర్జనలు, ఇతర ఆనవాళ్లను నమోదు చేశారు. వాటి ఆధారంగా పెద్ద పులల సంఖ్యను నిర్ధారించారు. 2023 - 24లో నిర్వహించిన లెక్కింపులో 33 పులులు ఉన్నట్లు తేలగా, తాజా గణనలో వీటి సంఖ్య 36 కు చేరినట్లు వెల్లడయ్యింది.

2,166.37 చదరపు కిలోమీటర్లు

అమ్రాబాద్ పులుల అభయారణ్యం 2,166.37 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. అందులో కోర్ ఏరియా 1,750, బఫర్ ఏరియా 445 చదరపు కిలోమీటర్లు ఉంది. ప్రతీ సంవత్సరం జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో మాన్‌సూన్ బ్రేక్ అమలు చేస్తున్నారు. సంతానోత్పత్తికి అనువైన ఆ సమయంలో పర్యాటకులను, పశువులు, గొర్రెల కాపరులు అడవిలోకి వెళ్లడంపై నిషేధం విధిస్తున్నారు. దీంతో పులులు, ఇతర వన్యప్రాణులు స్వేచ్ఛగా జత కట్టేందుకు అనువైన వాతావరణం నెలకొంటోంది. దీంతో పెద్దపులుల సంఖ్య పెరుగుతోంది. అలాగే అడవుల సంరక్షణలో స్థానిక చెంచులను భాగస్వాములను చేయడం సత్ఫలితాలను ఇస్తోంది. దీనికి తోడు సమృద్ధిగా వర్షాలు కురుస్తుండటంతో పచ్చిక బయిళ్లు పెరిగి, శాఖాహార జంతువులకు ఆహారం లభిస్తోంది.

కనువిందు చేస్తున్న వన్యప్రాణులు

ప్రతీ సంవత్సరం మాన్‌సూన్ సీజన్ ముగిసిన తర్వాత జంగిల్ సఫారీకి అటవీశాఖ పర్యాటకులకు అనుమతిస్తోంది. వారు సఫారీ వాహనాల్లో అడవిలో పర్యటించే అవకాశం కల్పిస్తున్నారు. ఆ సమయంలో వారికి చిరుతలు, పెద్దపులులు, జింకలు తదితర వన్యప్రాణులు కనిపిస్తున్నాయి. ఈ సంవత్సరం జనవరి నుంచి ఇప్పటి వరకు 4 చోట్ల పెద్దపులులు కనిపించాయి. ఫిబ్రవరి 9న శ్రీశైలం ప్రధాన రహదారి సమీపంలో పర్యాటకులకు, మే 17న అటవీశాఖ అధికారులకు పెద్ద పులులు కనిపించింది. అలాగే గత నెల 3, 14 తేదీల్లో సఫరీ టూర్‌కు వెళ్లిన వారికి కూడా కనిపించాయి. వాటితో పాటు చిరుతలు, ఎలుగుబంట్లు, దుప్పులు, మనుబోతులు, జింకలు, ఇతర జంతువులు, పక్షులు దర్శనమిస్తున్నాయి.

పులుల కదలికలపై ప్రత్యేక నిఘా



అభయ్యారణంలో పులుల కదలికలపై సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. అటవీశాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అలాగే నల్లమల పరిసర గ్రామాల ప్రజల భాగస్వామ్యంతో అటవీ సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా ఏకో టూరిజం దీనికి ఎంతోగానో ఉపకరించింది. అలాగే అడవులలో నివసిస్తున్న చెంచు యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం. దీంతో వారు ఇది మా అడవి అన్న భావనతో వారు అడవి అభివృద్ధికి సహకరిస్తున్నారు.

రోహిత్ గోపిడి, డీఎఫ్‌వో


పర్హాబాద్ రహదారిపై గుంతలో నీటిని తాగుతున్న పెద్దపులి

స్వేచ్ఛగా సంచరించిన పెద్దపులి

» పర్హాబాద్ బేస్ క్యాంపు వాచర్లకు కనిపించిన పెద్దపులి

మన్ననూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నల్లమల అభయారణ్యంలో సోమవారం సాయంత్రం పెద్ద పులి దర్శనమిచ్చింది. పర్హాబాద్ చౌరస్తా నుంచి నిజాం రాజు బంగ్లా (శికార్‌ఘర్)కు వెళ్లే మార్గంపై విధి నిర్వహణలో ఉన్న బేస్ క్యాంపు వాచర్లకు సోమవారం సాయంత్రం కనిపించింది. ఇటీవల కురిసిన వర్షాలకు పర్హాబాద్ మట్టిరోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలవగా, ఆ నీటిని తాగి పెద్దపులి దాహార్తి తీర్చుకుంది. ప్రస్తుతం నల్లమలలో పెద్దపులులు జతకట్టే సమయం కావడంతో జూలై 1 నుంచి సెప్టెంబరు 30 వరకు అడవిలోకి సఫారీ పర్యాటకులు గానీ, ఇతరులెవ్వరికీ అనుమతులు లేవు. ఎలాంటి అలజడి లేకపోవడంతో పెద్దపులి మట్టి రోడ్డుపై పడుకొని ప్రశాంతంగా సేద తీరుతూ కనిపించింది. ఆ దృశ్యాన్ని బేస్ క్యాంపు వాచర్లు తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీసి అటవీశాఖ ఉన్నతాధికారులకు షేర్ చేశారు. ఈ విషయాన్ని అమ్రాబాద్ రేంజ్ అధికారి వీరేశ్ ధ్రువీకరించారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

» బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు ఆచారి


సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

వెల్దండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలకేంద్రంలోని ఆకృతిగార్డెన్‌లో సోమవారం నిర్వహించిన బీజేపీ మండల కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలశాఖ అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో అప్రజాస్వామిక ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారిని మోసం చేసిందని, హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి, నాయకులు దుర్గాప్రసాద్, నర్సింహ, పీఏసీఎస్ వైస్‌చైర్మెన్ రాజేందర్‌రెడ్డి, రామస్వామి, కృష్ణారెడ్డి, దేవేందర్, చక్రవర్తిగౌడ్, మోహన్‌రెడ్డి, జంగయ్యయాదవ్, శ్రీనివాసాచారి, శశిధర్‌రెడ్డి, విష్ణుగౌడ్, సత్యనారాయణ, రాములు, రవికుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బౌన్సర్లతో దాడి చేయించారు

» ఇథనాల్ పరిశ్రమ యాజమాన్యంపై పెద్ద ధన్వాడ రైతుల ఫిర్యాదు

» జాతీయ మానవ హక్కుల కమిషన్ బహిరంగ విచారణ


మానవహక్కుల కమిషన్ విచారణకు వచ్చిన పెద్ద ధన్వాడ రైతులు

హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన ప్రకటిస్తున్న తమపై సదరు కంపెనీ యాజమాన్యం బౌన్సర్లతో దాడి చేయించిందని పెద్ద ధన్వాడ రైతులు, బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం వేదికగా జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సోమవారం బహిరంగ విచారణ నిర్వహించింది. ఈ సందర్భంగా పెద్దధన్వాడ గ్రామస్థులు అధిక సంఖ్యలో బహిరంగ విచారణ ప్రాంగణానికి వచ్చారు. పచ్చని పొలాలను కాజేసే ఇథనాల్ కంపెనీ తమకు వద్దు అంటూ ఉద్యమిస్తున్న రైతులు, ఇతర గ్రామస్థులపై ఇరవైమందికి పైగా ప్రైవేటు బౌన్సర్లు విరుచుకు పడ్డారని తెలిపారు. ఆ దాడిలో మరియమ్మ అనే దళిత మహిళ తలకు దెబ్బతగిలిందని అడ్వకేట్ రామారావు కమిషన్‌కు వివరించారు. బాధితురాలు కూడా బెంచ్ ముందు హాజరయ్యారు. పోలీసులు కూడా కంపెనీ యాజమాన్యం పక్షాన నిలిచి, కనీసం తమ ఫిర్యాదును కూడా తీసుకోలేదని చెప్పారు. పైగా కనిపించిన వారిని కనిపించినట్లుగా అరెస్టు చేశారని తెలిపారు. వారిలో 12 మంది రైతులను 16 రోజులు రిమాండ్‌లో ఉంచారని చెప్పారు. మరో 40 మంది గ్రామస్థులపై అక్రమ కేసులు బనాయించారని డివిజన్ బెంచ్ - 1 ముందు ఆవేదనను వెలిబుచ్చారు. బాధితుల గోడు అంతా విన్న జస్టిస్ రామ సుబ్రహ్మణ్యన్ స్పందిస్తూ, విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు.

కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలి

వనపర్తి విద్యావిభాగం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వనపర్తి జిల్లా కేంద్రంలో విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బస్ డిపోకు ఎదురుగా ఉన్న కోచింగ్ సెంటర్ ముందు సోమవారం ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, గిరిజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సమాచారం అందుకున్న మండల విద్యాశాఖ అధికారి మద్దిలేటి కోచింగ్ సెంటర్‌ను పరిశీలించారు. తగిన వసతులు లేకపోవడంతో యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం ఆది, జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పవన్‌కుమార్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివనాయక్, మహేశ్, ప్రవీణ్, పీడీఎస్‌యూ నాయకులు అనిల్, స్వామి, రాఘవేంద్ర, యశ్వంత్, బంజారా గిరి జన విద్యార్థి సంఘం నాయకులు శివ, చరణ్, రాము, వినోద్ పాల్గొన్నారు.

ఇక్కడ నాగుల పంచమి అక్కడ తేళ్ల పంచమి

» తేళ్లకు భక్తితో పూజలు, వాటితో ఆటలు

» అవి కుట్టవని, కుట్టినా ఏమీ కాదని చెప్తున్న గ్రామస్థులు

» కర్ణాటకలోని కందుకూరులో వింత పండుగ


ఆలయంలో కొలువైన తేళ్లదేవత

నారాయణపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మనం నాగుల పంచమిని భక్తిశ్రద్ధలతో జరుపుకుంటాం.. కానీ ఆ గ్రామంలో తేళ్ల పంచమిని జరుపుకుంటారు.. అక్కడ కొలువైన తేళ్ల దేవతకు భక్తిశ్రద్ధలతో పూజలు కూడా చేస్తారు. నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని కర్ణాటక రాష్ట్రం, యాదగిరి తాలూకాలోని కందుకూర్ గ్రామంలో ఈ వింత ఆచారం తరతరాలుగా కొనసాగుతోంది. ప్రతీ సంవత్సరం శ్రావణమాసం పంచమి నాడు ఈ పండుగను జరుపుకుంటారు. ఈ వింత ఆచారాన్ని చూడాలంటే మంగళవారం (నేడు) ఆ గ్రామంలోని తేళ్ల దేవత ఆలయానికి వెళ్లాల్సిందే. నారాయణపేట జిల్లా కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో యాద్గీర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన కందుకూరు గ్రామంలోని కొండమ్మవ్వ గుట్టపై తేళ్ల దేవత ఆలయం ఉంది. ప్రతీ సంవత్సరం నాగుల పంచమి రోజున అక్కడ తేళ్ల పంచమిని నిర్వహిస్తారు. భక్తులు తేళ్ల దేవతకు పాలుపోసి పూజలు చేస్తారు. ఆ తర్వాత కొండపై ఉన్న ఏరాయిని కదిపినా తేళ్లు బయటకు వస్తాయి. వాటిని పట్టుకొని సరదాగా ఆడుకుంటారు. అవి ఎవరినీ కుట్టవని ఒక వేళ కుట్టినా ఆలయంలోని విభూతిని రాసుకుంటే సరిపోతుందని స్థానికులు చెప్తారు. వాటిని పట్టుకొని చేతులు, నాలుక, తలపై వేసుకొని ముచ్చట పడతారు. ఈ పండుగను తాము తరతరాలుగా జరుపుకుంటున్నామని గ్రామస్థులు చెప్తున్నారు.

ప్రహరీ క్లబ్బులు ఏర్పాటు చేయాలి

» డీఈవోకు జేబీఎం ప్రతినిధులు వినతి


వినతి పత్రం అందజేస్తున్న జేబీఎం ఉమ్మడి జిల్లా కన్వీనర్ సుదర్శన్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో ప్రహరీ క్లబ్బులు ఏర్పాటు చేయాలని జవహర్ బాల్ మంచ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ సుదర్శన్ కుమార్ కోరారు. ఈ మేరకు మంచ్ ప్రతినిధులు ప్రసాద్, సమీర్‌లతో కలిసి సోమవారం మహబూబ్‌నగర్ డీఈవో ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రహరీ క్లబ్ ముఖ్య ఉద్దేశాన్ని విద్యార్థులకు వివరించాలని కోరారు. మాదకద్రవ్యాల వినియోగంతో ఎదురయ్యే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయం, రవాణాను అరికట్టడం, అనుమానాస్పద చర్యలను గుర్తించి అధికారులకు సమాచారం ఇవ్వడం తదితరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ప్రహరి క్లబ్ ముఖ్య ఉద్దేశాలని చెప్పారు. ఈ సందర్భంగా స్పందించిన డీఈవో మాట్లాడుతూ ఈ విషయంపై అన్ని పాఠశాలకు ఉత్తర్యులు జారీ చేసినట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మైనార్టీ యువతీ యువకులకు ఉచిత ఫౌండేషన్ కోర్సు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శంకరాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్, కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ హైదరాబాద్ తరుపున చదువుతున్న మైనార్టీ విద్యార్థులకు గ్రూప్-1, 2 ,3, 4, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ వివిధ ప్రభుత్వ ఉద్యోగాల కోసం 4 నెలల ఉచిత శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. విద్య అర్హత సర్టిఫికెట్లను దరఖాస్తుకు జత చేసి ఆగస్టు 21లోగా కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉండాలి

కోయిలకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పరిసరాలు శుభ్రంగా ఉండాలని ఎంఈవో వెంకటేజీ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెచ్ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే రోగాలు ప్రబలుతాయని, మురుగు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలన్నారు.

పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పెద్దింటి రామకృష్ణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రగతి శీల యువజన సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం హైదరాబాద్‌లో మార్క్స్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర కమిటీని ఎన్నుకోగా, జిల్లాకు చెందిన పెద్దింటి రామకృష్ణను పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా జిల్లాకు చెందిన పీడీఎస్‌యూ నాయకుడు నరసింహను రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం తెలిపారు.

'నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఏర్పాటు చేసిన మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ సెంటర్ ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ సహకారంతో నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని పర్యవేక్షకులు గుండా మనోహర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి, మాట్లాడారు. ఫస్ట్ శిక్షణ కేంద్రం ద్వారా 190 మంది నిరుద్యోగ యువతకు మొదటి బ్యాచ్‌లో సాఫ్ట్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఫస్ట్ ఇన్‌చార్జి నిజలింగప్ప, సెట్విన్ విజయకుమార్, ఇన్ఫోసిస్ సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

దేవరకద్ర, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని హజీలాపూర్‌లో నిర్వహించిన మండల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్ వైస్ చైర్మన్ హన్మంతురెడ్డి, నాయకులు ఉషన్నప్ప, రాజశేఖర్, శ్రీకాంత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, చంద్రమౌలి పాల్గొన్నారు.

ఖేలో ఇండియా ఉషు ఉమెన్స్ లీగ్‌లో విద్యార్థినుల ప్రతిభ

జడ్చర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఖేలో ఇండియా ఉషు ఉమెన్స్ లీగ్‌లో జడ్చర్ల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని చౌహన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన లీగ్‌లో మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 10 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. అందులో కారుణ్య, జస్మిత, హారిక, షేక్‌సమీనాబేగం మెడల్స్ సాధించగా, ఉషు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్ అందజేశారు.

జాతీయ స్థాయి కరాటే టోర్నీ బ్రోచర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 10న నగరంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ, తైక్వాండో టోర్నీ బ్రోచర్‌ను సోమవారం జిల్లా కేంద్రంలోని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్ ఆవిష్కరించారు. మాస్టర్ వెంకటేశ్ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు టోర్నీలో పాల్గొంటారని తెలిపారు.

బీసీలపై కుట్రలు తగదు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : బీజేపీలో అంచెలంచెలుగా ఎదిగి, రాష్ట్ర కోశాధికారిగా ఉన్న బండారి శాంతకుమార్ బీసీ అన్న కారణంతోనే ఆయనపై అగ్ర వర్ణాల నాయకులు కుట్రలు చేస్తున్నారని బీసీ మేధావుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రభాకర్ ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో శాంతకుమార్ గో బ్యాక్ అంటూ నిరసన తెలిపి అవమానించడం సిగ్గుచేటన్నారు. బీసీ మేధావుల సంఘం నాయకులు శ్రీనివాస్‌సాగర్, రాంచందర్‌జీ, నారాయణ పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ పూజలు

కోయిలకొండ/దేవరకద్ర/మూసాపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రసిద్ధ వీరభద్రస్వామి, లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, దేవరకద్ర మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్య స్వామి, ప్రసన్న అంజనేయస్వామి, శివాల యం అడ్డాకుల మండలం కందూరు రామ లింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ సోమవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

పులిగుట్టలోనే చిరుత

» పరిసర ప్రాంతాల నుంచి ఆవులు, గొర్రెల తరలింపు

» బోను స్థలం మార్చిన అటవీ అధికారులు



పులిగుట్టలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న అధికారులు

కోయిలకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొతలాబాద్‌లో శనివారం రాత్రి గొర్రెల మందపై దాడి చేసి గొర్రెల కాపరి, రైతులను గాయపర్చిన చిరుత పులిగుట్టలో అమర్చిన బోనుకు చిక్కలేదు. ఆదివారం రాత్రి అటవీ అధికారులు పులిగుట్ట సమీపంలో బోను, సీసీ కెమెరాలు పెట్టి సమీక్షిస్తున్నారు. కాగా సోమవారం మధ్యాహ్నం పులిగుట్ట సమపంలోని రైతులకు చిరుత మళ్లీ కనిపించింది. ఈ విషయాన్ని రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా డిప్యూటీ రెంజ్ అధికారి రాజశేఖర్‌తో పాటు బీట్ అధికారులు రాఘవేందర్, ఉమేష్, చంద్రశేఖర్ పులిగుట్ట ప్రాంతంలో పెట్టిన బోను, సీసీ కెమారాల స్థలం మార్పు చేశారు. పులిగుట్ట సమీపంలోని పరిసర పంట పొలాల వద్ద పశువులు, గొర్రెలను గ్రామంలోకి తరలించారు. పులిగుట్ట కొండ ప్రాంతం విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో చిరుత చిక్కడం కష్టంగా మారింది.



గొర్రెను ఎరగా పెట్టి అమర్చిన బోను

చిరుతను బంధించేందుకు చర్యలు : డీఎఫ్‌వో

కొతలాబాద్‌లోని పులిగుట్ట వద్ద చిరుతను బంధించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా అటవీశాఖ అధికారి సత్యనారాయణ తెలిపారు. సోమవారం పులిగుట్ట వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం సీసీ కెమెరాలు, బోను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించడం జరుగుతుందని వెల్లడించారు. చిరుత దాడిలో గాయపడిన గొర్రెల కాపరి, రైతులు కోలుకున్నారని తెలిపారు. త్వరలో చిరుతను బంధిస్తామని తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాల మంజూరుపై హర్షం

» సీఎం, ఎమ్మెల్యే యెన్నం చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం, ఎమ్మెల్యే యెన్నం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు అభిప్రాయపడ్డారు. పాలమూరుకు మరో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ సోమవారం తెలంగాణ చౌరస్తాలో వారి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేసి సంబురాలు చేసుకున్నారు. మండలంలోని ధర్మాపూర్ ఆల్ మదీనా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రారంభించనున్న జీకే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఏర్పాటుకు అన్ని రకాల అనుమతులు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ మాట్లాడుతూ చదువుతోనే భవిష్యత్తు అని, అందుకే పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని ఎమ్మెల్యే యెన్నం విద్యపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ విద్యావంతుడైన ఎమ్మెల్యే విద్యా ప్రమాణాలు పెంచ డంపైనే దృష్టి సారించారన్నారు. నాయకులు సి రాజేఖాద్రి, బెక్కరి అనిత, వసంత, చంద్రకుమా ర్ గౌడ్, సీజె బెనహర్, సాయిబాబ, రాములు యాదవ్, అవేజ్, అజ్మత్‌అలీ, నాగరాజు పాల్గొన్నారు.

జైపాల్‌రెడ్డికి ఘన నివాళి



జైపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

మిడ్జిల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మాజీ కేంద్ర మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ రోగులకు పండ్లు పంచిపెట్టి, అయన సేవలను కొనియాడారు. నాయకులు వెంకటయ్య, గౌస్, మల్లికార్జున్‌రెడ్డి, సత్యంగౌడ్, వెంకటేష్‌గౌడ్, అశోక్, ఆదాం, బాలయ్య, జహీర్, విజయ్‌కుమార్, శంకర్‌నాయక్, కృష్ణయాదవ్, పర్వతాలు, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

● మహబూబ్‌నగర్ విద్యావిభాగం : మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ సూదిని జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం జయప్రకాష్ నారాయణ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆయన విగ్రహానికి కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విద్యారంగానికి కృషి చేసిన రిటైర్డ్ డీఈవో డాక్టర్ శివర్పక విజయ్‌కుమార్, వందేమాతం మాధవరెడ్డికి జైపాల్‌రెడ్డి స్మారక స్ఫూర్తి అవార్డులు అందించారు. ఒక్కొరికి రూ.25 వేల చెక్కులు అందించారు. ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈవీ చంద్రశేఖర్, అధికారులు సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : చిరుత పులి దాడిలో గాయపడి జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పరామర్శించారు. కోయిలకొండ మండలం కొతలాబాద్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి గొల్ల మైబన్న, రైతులు చెన్నారెడ్డి, సత్యనారాయణ రెడ్డిని పరామర్శించి, మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు భూమి పూజ

జడ్చర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాటునకు మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కౌన్సిలర్ నందకిశోర్‌గౌడ్ సోమవారం భూమి పూజ చేశారు. పట్టణంలోని గాంధీచౌరస్తా నుంచి నేతాజీచౌరస్తాకు వెళ్లే దారిలోని రైల్వేగేటు వద్ద నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద లైటింగ్ వ్యవస్థ లేకపోవడంతో వాహనదారులు, పాదచారులు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, రమేశ్, సతీష్, ఉమాశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై నిలిచిన లారీ.. స్తంభించిన ట్రాఫిక్

జడ్చర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణంలో నేతాజీచౌరస్తా నుంచి సిగ్నల్‌గడ్డకు వెళ్లే దారిలో పెట్రోల్‌బంకు సమీపంలో సోమవారం ఓ లారీ సాంకేతిక కారణాలతో నడిరోడ్డుపై నిలిచిపోయింది. దీంతో అర గంట పాటు ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు, ఇతర వాహనాలన్నీ ట్రాఫిక్‌లో నిలిచిపోయాయి.



నిలిచిన లారీ, స్తంభించిన ట్రాఫిక్

రోస్టర్ పాయింట్లు సవరించాకే నోటిఫికేషన్లు వేయాలి

పాలమూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కులాల రోస్టర్ పాయింట్లు 22 నుంచి 16 పాయింట్‌కు సవరించే వరకు ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ వేయరాదని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానుగడ్డ యాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్‌ను కలిసిన మాలల ప్రతినిధులు సమస్యను వివరించారు. వర్గీకరణతో మాలలు విద్య, ఉద్యోగ రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని గ్రూప్-3లో మాలలతో పాటు మరో 25 కులాలకు అన్యాయం చేసేలా ప్రభుత్వం రూపొందించిందన్నారు. ప్రస్తుతం రోస్టర్ పాయింట్లు కేటాయింపు సవరణ తరువాతనే నోటిఫికేషన్లు వేయటంతో అందరికి న్యాయం జరుగుతుందన్నారు. ఎడ్ల కృష్ణయ్య, బ్యాగరి చెన్నకేశవులు, బ్యాగరి శ్రీనివాసులు, గోకం చెన్నయ్య పాల్గొన్నారు.

సిగ్నల్ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న తండావాసులు, బీజేవైఎం నాయకులు

మిడ్జిల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దగుండ్లతండా గ్రామ పంచాయతీ మర్లాబాయితండా నుంచి 167వ జాతీయ రహదారిపైకి రావాలంటే సిగ్నల్స్ లేకపోవడంతో తండావాసులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని సోమవారం తండావాసులతో కలిసి బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఆర్టీసీ బస్‌స్టాప్ గురించి ఆయా శాఖల అధికారులకు రిక్వెస్ట్ లేటర్‌ను ఫార్వర్డ్ చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇది వరకే నేషనల్ హైవే అథారిటీ అధికారులతో మాట్లడామని, వారు సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి సిగ్నల్స్ ఏర్పాటుకు తమకు రిక్వెస్ట్ లెటర్‌ను ఫార్వర్డ్ చేస్తే వెంటనే చర్యలు చేపడుతామని చెప్పడంతో వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్‌నాయక్, తండావాసులు శ్రీను, హాతీరాం, రాజ్‌కుమార్, మల్లేష్ ఉన్నారు.

పాఠశాలకు బెంచీల వితరణ

జడ్చర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టారం ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి సోమవారం బెంచీలను అందజేశారు. కృష్ణగౌడ్, లక్ష్మయ్య, సత్తయ్య, శ్రీశైలం, బస్సీలాల్, ఉపాధ్యాయుడు కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై వెబినార్

జడ్చర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థినులకు ఆర్థిక అక్షరాస్యతపై వెబినార్ నిర్వహించారు. చిన్న పొదుపు ప్రణాళికలు, మ్యూచివల్ ఫండ్స్‌పై అవగాహన కల్పించారు. ప్రతీ నెల చిన్న మొత్తాలను పొదుపు చేసుకుని భవిష్యత్ అవసరాల కోసం డబ్బును సమకూర్చుకోవచ్చని రీసోర్స్ పర్సన్ ప్రదీప్‌పాండే తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య, కోఆర్డినేటర్ పుష్పలత, సతీష్, నందకిశోర్, ప్రవీణ్‌కుమార్, వీరప్రతాప్ పాల్గొన్నారు.

ఫార్మసీ రిజిస్ట్రీ తప్పనిసరి : ఏవో

మూసాపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలకు పొందేందుకు పార్మసీ రిజిస్ట్రీ తప్పనిసరి అని ఏవో అనీల్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని గ్రామాల రైతులు సంబంధిత ఏఈవోల దగ్గర ఆధార్‌కార్డుతో పాటు మొబైల్ నెంబర్‌ను తెలియజేయాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు 50శాతం రైతులు మాత్రమే ఫార్మసీ రిజిస్ట్రీ చేయించారని, మిగతా వారందరు ఆగస్టు 5లోగా చేయించాలని, లేకుంటే కేంద్రం పథకాలకు అర్హులు కారని తెలిపారు.

ధూమ, మద్యపానంపై విద్యార్థుల ర్యాలీ

గండీడ్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ధూమపానం, మద్యపానంతో అనారోగ్య సమస్యలు వస్తామని వెన్నాచేడ్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు గ్రామంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రయూస్ ఫాతీమా ధూమపానం, మద్యపానంతో వచ్చే రోగాలు, సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పీఈటీ మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పాఠశాలకు చెస్ బోర్డులు పంపిణీ

గండీడ్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం చెస్ నెట్‌వర్క్ టీం ఆధ్వర్యంలో సోమవారం 135 చెస్ బోర్డులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, ఎన్ఆర్ఐ ఫోరం దాతలు అనసూయ, సురేందర్, రాజేందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం

గండీడ్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : టీచర్ల సమస్యలపై నిరంతరం పోరాటం చేసేది టీఎస్ యూటీఎఫ్ అని జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కొంరెడ్డిపల్లి, పగిడ్యాల్ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు స్వీకరించారు. టీఎస్ యూటీఎఫ్ గండీడ్, మహమ్మదాబాద్ మండల అధ్యక్షులు గంట శ్రీనివాస్, వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య పాల్గొన్నారు.

చెరువుల మరమ్మతు చేపట్టాలి

పాలమూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని చెరువులు, కుంటలు మరమ్మతులు చేపట్టి మత్స్యకారుల అభివృద్ధికి సహకరించాలని ముదిరాజు సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సంఘం ప్రతినిధి బృందం కలెక్టర్‌ను కలిసి చెరువులు, కుంటల మరమ్మతు ప్రాధాన్యతను వివరించారు. ఇప్పటికే ఆక్రమణకు గురైన, గురవుతున్న చెరువులు, కుంటలను పరిశీలించి రక్షించాలన్నారు. మత్స్యసహాకార శాఖలో ఎన్నికలు నిర్వహించాలని, యువతకు మార్కెటింగ్, పెట్టుబడి రుణాలు అందజేయాన్నారు.

ప్రత్యేకాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, వివిధ అంశాలపై సూచనలు చేశారు. మహమ్మదాబాద్, వీహెచ్‌సీలో షార్ట్ సర్క్యూట్‌పై సందర్శించి సమస్య పరిష్కరించాలని పంచాయతీరాజ్ ఈఈ, డీఎంహెచ్‌వోను ఆదేశించారు. మునిసిపల్ కమిషనర్లు పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, నర్సింహారెడ్డి, ఆర్డీవో నవీన్, జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, డీఆర్డీవో నర్సిములు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తా : ఎస్పీ



మహిళ వద్దకే వెళ్లి సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ

మహబూబ్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని, బాధితులకు అండగా ఉంటామని ఎస్పీ జానకి అన్నారు. సోమవారం ఎస్పీ తన కార్యాలయంలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఓ వృద్ధ మహిళ మెట్లు ఎక్కలేని పరిస్థితిలో కిందే ఉండిపోగా.. విషయం తెలుసుకున్న ఎస్పీ ఆమె వద్దకే వచ్చి ఫిర్యాదు స్వీకరించి సమస్యను తెలుసుకున్నారు. వెంటనే సమస్య పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. జిల్లా నలుమూలల నుంచి 13 మంది బాధితులు ఎస్పీకి వినతులు సమర్పించారు. ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్ చేయాలని, ఎప్పటికప్పుడు పరిష్కార స్థితిని పర్యవేక్షించాలన్నారు.

ప్రజా భద్రత.. పోలీసుల బాధ్యత



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు భద్రత కల్పించడమే పోలీసు లక్ష్యమని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో నగరంలోని వీరన్నపేటలో 'ప్రజా భద్రత - పోలీసు బాధ్యత' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు పోలీసుల సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. చట్టపరంగా జీవించే వారు భయపడాల్సిన అవసరం లేదన్నారు. వర్గాలుగా విడిపోయి గొడవలు పెట్టడం సమాజ అభివృద్ధికి ఆటంకమని తెలిపారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు అన్ని వేళల పోలీస్ రికార్డుల్లో ఉంటారని, ఇది గుర్తించుకుని నేరాల వైపు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో గంధరగోళం సృష్టించే వారిపై కఠిన చర్యలుంటాయని బైండోవర్ తప్పదన్నారు. కేసుల్లో ఇరుక్కుంటే ఉద్యోగాలు, పాస్‌పోర్టు, విదేశీ అవకాశాలకు ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. వన్‌టౌన్ సీఐ అప్పయ్య, ఎస్ఐలు శీనయ్య, రషీద్, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుజాత పాల్గొన్నారు.

హెపటైటిస్‌పై అవగాహన అవసరం



ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ కౌన్సిలర్ కృష్ణమోహన్

మహబూబ్‌నగర్ (వైద్య విభాగం), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : హెపటైటిస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన అవసరమని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ వివేక్‌సాగర్ అన్నారు. సోమవారం ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్యామ్యూల్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించగా, మాజీ కౌన్సిలర్ కృష్ణమోహన్ ప్రారంభించారు. అనంతరం ఉచితంగా హైపటైటిస్ వ్యాధి వ్యాక్సిన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వివేక్ మాట్లాడుతూ హైపటైటిస్ అనే వైరస్ ప్రమాదకరమైందని, ఇది ముందుగా కాలేయంపై ప్రభావం చూపి క్యాన్సర్ వంటి ప్రాణాంతకమైన జబ్బులకు దారితీస్తుందన్నారు. ముఖ్యంగా ఈ వైరస్ సంభోగం, రక్తమార్పిడి, అశుభ్రమైన నీడిల్స్ వాడడం, అరుదైన సందర్భాల్లో చెమట రూపంలో కూడా వ్యాపిస్తుందని, ఇది కుటుంబ సభ్యులందరికీ సోకే ప్రమాదం కూడా ఉందన్నారు. ప్రతీ ఒక్కరు హైపటైటిస్ బీ వ్యాక్సిన్ వేసుకోవాలని సూచించారు. శ్యామ్యూల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత డాక్టర్ శ్యామ్యూల్, డాక్టర్ నితీషా, ఆసుపత్రి సిబ్బంది రామకృష్ణ, కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

ఓపెన్ యూనివర్సిటీలో దరఖాస్తుల ఆహ్వానం

జడ్చర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరంలో చేరేందుకు ఆగస్టు 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య, సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ సదాశివయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిప్లమా ఏదైన రెండు సంవత్సరాల కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా ఆన్‌లైన్ ద్వారా మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరంలో చేరేందుకు సైతం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకం



మాట్లాడుతున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుడి పాత్ర చాలా కీలకమని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పీయూలో కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో అమెరికాలోని గ్లోబల్ సెంటర్ ఫర్ ది డెవలప్‌మెంట్ ఆఫ్ ది హోల్ చైల్డ్ సహకారంతో సామాజిక, భావోద్వేగ అభ్యాసనంపై నిర్వహించే ఏడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి, మాట్లాడారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో మారుతున్న కాలనుగుణంగా విద్యార్థికి సమాజానికి అవసరమైన విద్యను అందించడానికి ఈ శిక్షణ ఎంతో దోహదపడుతోంన్నారు. గ్లోబల్ సెంటర్ ఫర్ ది డెవలప్‌మెంట్ ఆఫ్‌ది హోల్‌చైల్డ్ నార్త్‌డం యూనివర్సిటీకి చెందిన సీనియర్ రిసోర్స్ పర్సన్ శాలిని ఎంఈడీ, బీఈడీ అధ్యాపకులకు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. అంతకుముందు పీయూ ఫార్మసీ కళాశాల ఆడిటోరియంలో ఐక్యూఎసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని వీసీ జీఎన్ శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమేష్‌బాబు, ప్రిన్సిపాళ్లు డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా ఉపాధి ఆధారిత ప్రోత్సాహ పథకం



వినతి పత్రం ఇస్తున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల భవిష్య నిధి సంస్థలో కొత్తగా నమోదయ్యే కార్మిక ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి వికసిత్ భారత్ యోజన స్కీమ్ కింద కొత్తగా ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకం ప్రవేశపెట్టిందని పీఎఫ్ నోడల్ ఆఫీసర్ శ్రీలతరెడ్డి తెలిపారు. సోమవారం చైతన్య సెంట్రల్ స్కూల్‌లో పీఎఫ్ ఖాతాదారుల సమస్యలపై నిర్వహించిన నిధి ఆప్కే నిక్కట్ 2.0 కార్యక్రమంలో ఆమె ఈ స్కీం గురించి వివరించారు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి కొత్తగా ఉద్యోగాల్లోకి చేరి, తొలిసారి ఈపీఎఫ్‌వోలో పేరు నమోదైన ఉద్యోగులకు ఈ పథకం ద్వారా రూ.15 వేల ఆర్థిక ప్రోత్సాహాన్ని కేంద్రం ప్రకటించిందని, ఈ ప్రోత్సాహకం ఏడాది కాల వ్యవధిలో ఆరు నెలలకోసారి రెండు విడతలుగా నేరుగా ఉద్యోగుల ఖాతాలో డీబీటీ విధానంలో జమ చేస్తోందన్నారు. ఈ ప్రయోజనం రూ.లక్ష వరకు జీతం వచ్చే కొత్త ఉద్యోగులందరికీ వర్తిస్తోందని, కార్మిక ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు హైయ్యర్ పెన్షన్‌ను వెంటనే అమలు చేయాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు పీఎఫ్ నోడల్ అధిరానిరి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సెక్షన్ సూపర్‌వైజర్ శరత్, వివిధ కంపెనీల ఉద్యోగులు పాల్గొన్నారు.